పొదల మాటున ప్రమాదం


చోడవరం గ్రామం ప్రారంభంలో మలుపు వద్ద పెరిగిన పిచ్చిచెట్లు


పెద్దకండ్లగుంట- కొండపి గ్రామాల మధ్య పిచ్చి చెట్ల మధ్యలో ఉన్న సూచిక బోర్డు

- రహదారి మలుపుల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు
- రాత్రిళ్లు వాహనదారులకు తప్పని ఇబ్బందులు

కొండపి:

మండలంలో గ్రామీణ రహదారులకు ఇరువైపులా పనికిరాని పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మలుపుల వద్ద పిచ్చి చెట్లు ఏపుగా పెరగడంతో ఎదురు వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పెద్దకండ్లగుంట, జాళ్లపాలెం గ్రామాల మధ్యలో సుమారు నాలుగు కిలోమీటర్లు, అనకర్లపూడి, నెన్నూరుపాడు గ్రామాల మధ్యలో మలుపుల వద్ద, కొండపి, పెద్దకండ్లకుంట గ్రామాల మధ్యలో ఎస్ ఆకారంలో ఉన్న మలుపు వద్ద, కొండపి, పెరిదేపి గ్రామాల మధ్య రంగసాయి వాగు మలుపులు వద్ద పిచ్చి చెట్లు ఏపుగా పెరగడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు.

ఆ మలుపుల వద్ద ఎన్నో ప్రమాదాలు..

రోడ్లకు ఇరువైపులా చెట్లు పొదలు లాగా పెరిగి ఉండడంతో వాహనదారులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రెండు వారాల క్రితం కొండపి, అనకర్లపూడి గ్రామాల మధ్య జింక అడ్డు వచ్చి ఓ ద్విచక్ర వాహనదారుడు రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. కొండపి, పెద్దకండ్లగుంట గ్రామాల మధ్య ఉన్న ఎస్ ఆకారంలో ఉన్న


రంగ సాయి వాగు మలుపు వద్ద ఏపుగా పెరిగిన పిచ్చి చెట్లు

మలుపు వద్ద గతంలో అనేక సార్లు ప్రమాదాలు జరిగాయి. ఆ ప్రమాదాల్లో కొంతమంది ప్రాణాలు కోల్పోగా కొంతమంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఇప్పుడు అదే ప్రాంతంలో పిచ్చి చెట్లు ఏపుగా పెరిగి మలుపు కనిపించకుండా ఉన్నాయి. ఆ ప్రాంతంలో సూచిక బోర్డు ఒరిగి పిచ్చి చెట్ల మధ్యలో ఉఐది. ఎదురుగా ఏ వాహనం వస్తుందో అసలు వాహనం వస్తుందో లేదో అర్థం కాక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఈ రహదారిలో ప్రయాణించేవారు ఆ మలుపు వద్దకి వచ్చేసరికి సూచిక బోర్డు కనిపించకపోయేసరికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండపి, పెరిదేపి గ్రామాల మధ్య రంగసాయి వాగు వద్ద గతంలో అనేక ప్రమాదాలు సంభవించాయి. ఈ ప్రమాదాల్లో కూడా కొంతమంది మరణించగా కొంతమంది తీవ్ర గాయాలు పాలయ్యారు. ఈ ప్రాంతంలో పిచ్చి చెట్లు ఏపుగా పెరగడంతో ఎప్పుడు ఏ ప్రమాదాలు సంభవిస్తాయని వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఆయా గ్రామాల మధ్య ఎదురు ఎదురు వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెన్నూరుపాడు గ్రామంలో ముళ్ల చెట్లు వ్యాపించాయని గ్రామస్తులు చెబుతున్నారు. గతంలో వీటిని తొలగించేవారని కొన్నేళ్లుగా నిర్వహణను గాలికి వదిలేశారు. చోడవరం గ్రామం ప్రారంభంలో మామూలుగానే అక్కడకి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవు. దానికి తోడు పిచ్చి చెట్లు బాగా పెరగడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలకు నిలయాలుగా ఉన్న మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే కొంత మేర వాటిని అరికట్టవచ్చని వాహనదారులు చెబుతున్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో పిచ్చిచెట్లు బాగా పెరిగాయి. వెంటనే సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి పొదలను, ఆయా గ్రామాల మలుపుల వద్ద ఏపుగా పెరిగిన పిచ్చి చెట్లను తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


నెన్నూరుపాడు-అనకర్లపూడి గ్రామాల మధ్యలో ఉన్న మలుపు

క్లుప్తంగా

ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి


సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు ,దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని పలు సచివాలయాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 5వ సచివాలయం లోని హాజరు రిజిష్టర్, సర్వీస్ రిక్వస్ట్ రిజిస్టర్ తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది ప్రతిరోజు సకాలంలో హాజరు కావాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వహిస్తే శాఖా పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సచివాలయం సిబ్బంది యూనిఫాం ధరించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు మోడల్ పేపర్స్ పంపిణీ


విద్యార్థులకు మోడల్ పేపర్స్ పంపిణీచేస్తున్న దాత చైర్మన్ గఫార్

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని సి.నాగులవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు వీరాంజనేయులు సొంత నిధులతో యూటీఎఫ్ రూపొందించిన మోడల్ పరీక్ష పేపర్లు అందజేశారు. హెచ్‌ఎం మందా కుమారి, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి షేక్.పాదుషా, సీనియర్ నాయకులు ఎం శ్రీనివాసరాజు, జవంగుళ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి టంగుటూరు రైల్వే గేటు మూసివేత

టంగుటూరు: స్థానిక బొమ్మల సెంటర్లో 193వ రైల్వే గేటులో ఏడు రోజుల పాటు రాకపోకలు నిలిపివేస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టంగుటూరు రైల్వేస్టేషన్ పరిధిలో మూడో లైన్ పనులు ప్రారంభిస్తున్న సందర్భంగా ఈ నెల 21 నుంచి 27 వరకు రాకపోకలు నిలిపివేస్తున్నామని, ప్రత్యామ్నాయ మార్గంగా 194వ గేటుని ప్రజలు వినియోగించుకోవాలని రైల్వే అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కనిగిరిరూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. మున్సిపాలిటీలోని టౌన్ 3 ఫీడర్ పరిధిలో ఉన్న పవిత్ర కళ్యాణ మండపం ఏరియా, పాముఠు బస్టాండ్ ఏరియా, ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కరెంటు నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

వెంకటేశ్వరరెడ్డికి దద్దాల నివాళి


వెంకటేశ్వరరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల

సీఎస్‌పురం(పామూరు): వైఎస్సార్ సీపీ మాజీ సంయుక్తకార్యదర్శి, రెడ్డి సంక్షేమ సంఘ నాయకుడు పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి(72) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. మంగళవారం వెంకటేశ్వరరెడ్డి భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్, కదిరి పార్థసారది పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మృతుని భార్య, కుటుంబసభ్యులను పరామర్శించి అన్నివేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సాఆర్‌సీపీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, కనిగిరి జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, నారాయణస్వామి ఆలయ మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కే.రామిరెడ్డి, గట్లా విజయభాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతల సమావేశం బుధవారం మధ్యాహ్నం 3:30 గంటలకు జరుగుతుందని పార్టీ కార్యాలయ ప్రతినిధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగే సమావేశానికి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నేతలు హాజరు కావాలని కోరారు.

గ్రామాలను బలోపేతం చేయడమే లక్ష్యం


శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణమూర్తి


పామూరులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ


సీఎస్‌పురం: మాట్లాడుతున్న ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు

జరుగుమల్లి(సింగరాయకొండ): గ్రామాలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు కార్యాచరణ రూపొందించేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ రమణమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల సుస్థిరత, అభివృద్ధి లక్ష్యంగా మొదటి విడత శిక్షణ తరగతుల రెండవ రోజు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలలో ఆర్థిక వనరులు సమీకరించేందుకు అన్ని శాఖలు సమష్టిగా సమీక్ష చేసుకోవటానికి ఈ వేదిక దోహదపడుతుందన్నారు. ఎంపీపీ బెల్లం నిర్మలాదేవి, ఈఓఆర్డీ ఏడుకొండలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

పామూరు: గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఈఓపీఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో మంగళవారం స్థానిక సుస్థిరత అభివృద్ధి లక్ష్యాల సాధనపై శిక్షణ నిర్వహించారు. సుస్థిర లక్ష్యాలు 17లపై వివరించి సాధనకోసం అవలంబించాల్సిన విధి విధానాలపై శిక్షణ ఇచ్చారు. అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎస్.చెన్నకేశవ రెడ్డి, వ్యవసాయాధికారి కంచం రాధ, సర్వేయర్ స్నేహ, ఏపీఓ బి.మాల్యాద్రి, హెచ్ఓ కె.కుసుమ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వై.రమేష్ పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ మంచికంటి రంగసుబ్బరాయుడు అన్నారు. మండల పరిషత్ సమావేశ హాలులో మంగళవారం పంచాయతీల అభివృద్ధి లక్ష్యాలపై అన్ని శాఖల మండల అధికారులు, వీఆర్‌ఓలు, వీఏఏలు, ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. గ్రామాలు అభివృద్ధి వేగవంతం కావాలంటే క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, స్వచ్ఛందసంస్థల సహకారం అవసరమన్నారు.

సింగరాయకొండ: గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని ఎంపీడీఓ డి.జయమణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సింగరాయకొండలో హాజరైన అధికారులు

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు


చిర్రికూరపాడులో పొగాకు పంటను పరిశీలిస్తున్న ఏఓ


విత్తన శుద్ధి చేస్తున్న ఐసీఆర్‌పీ శృతి

టంగుటూరు: శనగ విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేస్తే తెగుళ్లను అరికట్టవచ్చని ప్రకృతి వ్యవసాయాధికారి వెంకట్రావు అన్నారు. మండలంలోని ఎం. నిడమానూరులో మంగళవారం రైతు కాకుమాని రమణయ్య 6 ఎకరాల పొలంలో శనగ విత్తనాలను విత్తుకునే ముందుగా విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేశారు. అనంతరం శనగ పంట సాగులో అంతర పంటలుగా ఆవాలు, ధనియాలు, పొద్దు తిరుగుడు పంటలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రసాయనాలకు బదులు ప్రకృతి ద్వారా లభించే ఆవుపేడ, ఇతర పదార్థాలతో కషాయాలు తయారు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఐసీఆర్పీలు శృతి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మద్రిపూడి: మిరప సాగు చేసిన రైతులు నల్లి, ఎండు తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవన శాఖాధికారి డి.సంధ్య అన్నారు. మండలంలోని గంగపాలెంలోసాగు చేసిన మిరపపంటను పరిశీలించారు. ఏఓ సీహెచ్ వెంకటేష్, ఉద్యాన విస్తరణాధికారి బి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): పొగాకు సాగులో మెళకువలు పాటించి తెగుళ్లను నివారించుకుని అధిక దిగుబడిని సాధించాలని ఏఓ పి.యుగంధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిర్రికూరపాడు, దావగూడూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ప్రతి రైతు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద లబ్ధి పొందాలని సూచించారు. ఏఏఓ శ్రీలేఖ, రైతులు పాల్గొన్నారు.


కనిగిరి: మాట్లాడుతున్న వ్యవసాయాధికారి జ జోత్స్నాదేవి

కనిగిరిరూరల్: రైతుల సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులను పొందాలని ఏఓ పి.జోత్స్నాదేవి అన్నారు. మండలంలోని తాళ్లూరు, బొమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవాలం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా కంది, శనగ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది తాతపూడి రాజశేఖర్, గొర్రె సుబ్బారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు తలనొప్పిగా ఎస్‌ఏ-1 పరీక్షలు

సింగరాయకొండ: పరీక్షలు నిర్వహించాలంటేనే ఉపాధ్యాయులు హడలెత్తిపోతున్నారు. ప్రతిరోజు పరీక్షకు గంట ముందు ఎంఈఓ కార్యాలయం వద్దకు వెళ్లి పరీక్షా పత్రాలు తెచ్చుకోవాల్సి ఉంది. ఈ ప్రకారం ప్రతిరోజు రెండుసార్లు ఉదయం, మధ్యాహ్నం పరీక్ష పేపర్లు తెచ్చుకోవాలి. ఆయా మండల కేంద్రంలోని పాఠశాల ఉపాధ్యాయులకు అయితే వెసులుబాటు ఉంటుంది. కానీ గ్రామాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులకు వెసులుబాటు ఉండదు. ఒక్కో గ్రామం మండల కేంద్రం నుంచి 2 నుంచి 25 కిలోమీటర్ల దూరం కూడా ఉంటాయి. దీంతో ఉపాధ్యాయులు అంతదూరం వెళ్లి పరీక్ష పత్రాలు రోజుకు రెండుసార్లు తెచ్చుకోవాలంటే తలకు మించిన భారం అవుతుంది. ఉన్నతాధికారులు ఈ విధానాన్ని మార్చి ప్రతి మండల పరిధిలోని కాంప్లెక్స్ వారీగా పాఠశాలలకు అందుబాటులో ప్రశ్నాపత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని, దీని వల్ల సమయం ఆదా అవడంతో పాటు, పనిభారం తగ్గుతుందని ఉపాధ్యాయులు కోరుతున్నారు.


పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నాపత్రాలను భద్ర పరుస్తున్న ఎంఈఓ

పోలీస్‌స్టేషన్ నుంచే ప్రశ్నాపత్రాల పంపిణీ.

ఎస్‌ఏ-1 పరీక్షలలో భాగంగా సోమవారం జరగాల్సిన లెక్కలు పరీక్ష లీక్ కావడంతో ప్రభుత్వం ఆ పరీక్షను రద్దు చేసింది. దీంతో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రశ్నాపత్రాలను ఎంఈఓ కార్యాలయం నుంచి తీసుకుని వచ్చి పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. దీంతో మంగళవారం పోలీస్‌స్టేషన్ నుంచే అన్ని పాఠశాలలకు ప్రశ్నాపత్రాలను ఉపాధ్యాయులకు ఎంఈఓ ఆధ్వర్యంలో సిబ్బంది పంపిణీ చేశారు. ఇప్పటివరకు ఎంఈఓ కార్యాలయం నుంచి ప్రశ్నాపత్రాలు తెచ్చుకున్నామని, మంగళవారం నుంచి పోలీస్‌స్టేషన్ నుంచి ప్రశ్నాపత్రాలు తీసుకుని వెళ్తున్నామని ఉపాధ్యాయులు చెప్పారు.

19 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కొండపి: పొగాకు రైతులు లైసెన్సులు పునరుద్ధరించుకునేందుకు ఈ నెల 19వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. రైతులు రూ.400 జరిమానాతో గురువారం వరకు చేసుకోవచ్చన్నారు.

దుప్పట్ల పంపిణీ

ఉలవపాడు: మండల పరిధిలోని వీరేపల్లి తూర్పు సంఘంలో పీపుల్స్ హెల్పింగ్ హాండ్స్ సంస్థ మంగళవారం 50 మంది గిరిజనులకు దుప్పట్లను పంపిణీ చేసింది. శీతాకాలం కావడంతో వీరికి అందచేసినట్లు సభ్యులు తెలిపారు. మిగిలిన గిరిజన కాలనీల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు హేమలత, తిరుపతి, సింహాద్రి పాల్గొన్నారు.

రైల్వేలైన్ భూముల పరిశీలన

పామూరు: మండలంలో ప్రతిపాదిత నడికుడి శ్రీకాళహస్తి రైల్వేలైన్ బ్రాడ్‌గేజ్ నిర్మాణంలో భాగంగా అదనపు భూసేకరణ, పరిహారం చెల్లింపుల నిమిత్తం మండలంలోని రావిగుంటపల్లె, ఇనిమెర్లకు చెందిన భూములను మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ కనిగిరి ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డితో కలిసి భూములను పరిశీలించారు. ఈసందర్భంగా రావిగుంటపల్లె వద్ద సర్వేనంబర్ 195/1, 213 లలో 1.05ఎకరాల భూమికి సంబంధించి రికార్డులను పరిశీలించి భూములను పరిశీలించారు. అదేవిధంగా మండలంలోని ఇనిమెర్లకు చెందిన సర్వేనంబర్ 640, 644/1, 987/1 లలో 4.91 ఎకరాల భూమి రికార్డులు, భూమిని పరిశీలించారు. రైల్వేలైన్ ప్రతిపాదిత భూములు చుక్కల భూములుగా ఉండగా గతంలో వీటికి అసైన్‌మెంట్‌కింద పరిహారం చెల్లించగా చుక్కల భూముల సమస్క పరిష్కారం అనంతరం సెటిల్‌మెంట్ భూములకింద పరిహారం చెల్లింపుపై రైతులతో ప్రస్తుత భూముల మార్కెట్‌రేటుపై చర్చించారు. మెరుగైన పరిహారం వచ్చేలా చూస్తామని రైల్వేలైన్ నిర్మాణానికి రైతులు సహకరించాలని ఆయన సూచించారు. ఆయన వెంట కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ బి.వి.రమణారావు, మండల సర్వేయర్ స్నేహ, వీఆర్‌ఓలు శ్రీను, గాబ్రియేలు, సచివాలయ సర్వేయర్లు డి.మహేష్, బ్రహ్మం పాల్గొన్నారు.


రావిగుంటపల్లెవద్ద ప్రతిపాదిత బిజి రైల్వేలైన్ స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

టంగుటూరు: ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని వల్లూరులో ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సుకు మంత్రి హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న వినతుల్లో ఎక్కువ భాగం భూ సమస్యలేనని, రెవెన్యూ సదస్సుల ద్వారా 45 రోజుల్లో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. సదస్సులకు రెవెన్యూ అధికారులతో పాటు అనుబంధంగా ఉన్న దేవదాయ, అటవీ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ తదితర సంబంధిత శాఖల అధికారులు వచ్చి సమస్యాల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. జిల్లాలో 18240 ఎకరాలు ఫ్రీ హోల్డ్ చేసి రిజిస్ట్రేషన్ చేసినట్లుగా, అక్రమాలు జరిగినట్లుగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. భూ యజమానులకు హక్కు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. జనవరి మొదటి వారంలో కొండపి, గిద్దలూరు నియోజక వర్గాల్లో జరిగే రెవెన్యూ సదస్సులకు రెవెన్యూ శాఖ మంత్రి, సీసీఎల్ఏ అధికారులు హాజరవుతారని తెలిపారు. అనంతరం సచివాలయ వద్ద రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనాయక్, తహసీల్దార్ ఆంజనేయులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


వల్లూరు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి స్వామి



చింతలపాలెంలో సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని చింతలపాలెం, గుంతచెన్నంపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి తహసీల్దార్ మంజునాథరెడ్డి అర్జీలు స్వీకరించారు. మొత్తం 20 అర్జీలు రాగా ఎక్కువగా అర్జీలు ఆన్‌లైన్‌కోసం, హద్దులు, ఇతర సమస్యల పరిష్కారానికి వచ్చాయి. సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండల పరిధి నందవనంలో జరిగిన రెవెన్యూ సదస్సులో మొత్తం 40 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు. భూమి ఆన్‌లైన్ చేయాలని 28, నివేశన స్థలం కోసం ఒకటి, సవరణకు 2, పొలం ఇతరులు ఆన్‌లైన్ చేయించుకున్నారని, ఆక్రమణదారుల పేర్లు తొలగించాలని, ఇతర సమస్యలపై 2 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. సర్వేయర్ కాకర్ల రమణయ్య, వీఆర్ఓ కాశయ్య, జేమ్స్, బెంజి, ఈఓ శంకర్, సర్పంచ్ కృపారావు, ఎంపీటీసీ నారాయణస్వామి, నీటి సంఘం అధ్యక్షుడు పెన్నా గురవయ్య పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ అశోక్ రెడ్డి అన్నారు. మండలంలోని తాళ్లూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సదస్సులో రెవెన్యూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే వేడుకలు


సీనియర్ సిటిజన్లకు సన్మానం

కనిగిరిరూరల్: పెన్షనర్స్ డే వేడుకలను మంగళవారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు టి.పెద్దిరెడ్డి అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పెన్షనర్ల సంఘ నాయకులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి, ఏపీ ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు పిల్లి వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ పెన్షనర్లు, విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగస్తులు అందరు ఐక్యతగా ఉండి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు టీ పెద్దిరెడ్డి, నరసింహారావు, యూటీఎఫ్ నాయకుడు మీగడ వెంకటేశ్వర్ రెడ్డి, విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్ల సంఘ నాయకులు ఆర్వీఎల్ నరసింహారావు, నాగభూషణం, చెన్నయ్య పాల్గొన్నారు.